చిన్న కథ:

# వదలని తెగులు

* శ్రీ పేకుమళ్ల కామేశ్వరరావు *

"ఓనాగీ! ఓనాగీ!" అని పిలిచింది సత్యవతి పొద్దుటి పూట.

"ఏ మండి అమ్మగారూ!" అని అడిగింది సావిడిలో కూర్చుని కునికి పాట్లు తీస్తున్న నాగి.

"ఏంచేస్తున్నావే అక్కడ?"

"ఊరికే కూకుండా నండమ్మా!"

"ఇదిగో ఈ కాఫీ గిళాను తీసుకు వెళ్ళు!"

"ఊఁ" అంటూ మూలుగుతూ లేచింది నాగి.

"పాపం కాఫీ తాగితే కాని ఏపనులూ చెయ్యో లేదు!" అంటూ విచారించింది సత్యవతి.

సత్యవతికి ఇరవై యేళ్ళుంటాయి ఆమె తండ్రి పెద్ద గవర్న మెంటు నౌఖరీ చేశాడు ఆమె స్పష్టంగా చెప్పనే చెప్తుంది "నాకు కాఫీ తాగి కూర్చోడానికంటె మరి దేనికీ ఓపిక లేదు" అని. అది చూసి మిగతా వాళ్ళు 'ఆవిడకి రాయసం!' అంటారు మొగుడు ఏదీ అనడు.

నాగి పనిమనిషి దానికి నలభై ఏళ్ళుంటాయి. ఎర్రగా పల్చగా ఉంటుంది పిల్లిని సృష్టించిన దేవుడే దానిని కూడా సృష్టించేడు. దానికి అవసర మైన వస్తువులు కన బడతాయి. అనవసరమైనవి కనబడవు పైనుంచి చూసిన వాళ్ళు మట్టుకు, 'దానిని మినుగుడు కళ్ళు' అంటారు

జానెడు కాఫీలోటా పట్టుకు వెళ్లింది నాగి సుఖంగా పీల్చి వేసింది. ఇంటి పనులు పింగళించి చక్కా పోయింది

శివయ్య తాలూకా కచ్చేరీలో గుమాస్తా వేళకి అక్కడ హాజరవాలి అందుచేత తొందరగా పనులు చేసుకొని భోజ నానికి లేచాడు

పీట దగ్గర అన్నీ అమరుస్తూ సత్యవతి వెండిగ్లాసు కోసం ఇక్కడ వెతికింది, అక్కడ వెతికింది ఇల్లంతా వెతుకు తూంది

'ఇంకా వడ్డించ లేదేమి?' అని తొందర పడ్డాడు భర్త.

"వడ్డిస్తానుండండి!"

"నేను త్వరగా పోవాలి మరి!"

"మీరు కాని క్షవరం చేసుకోడానికి వెండి గ్లాసుతీసేరా ఏమిటి?"

"నేనేమిటి! క్షవర మేమిటి! వెండి గ్లాసేమిటి!" అని ఆశ్చర్య పోయేడు శివయ్య.

"ఏమో మరి! కనబడడం లేదు".

"ఏదీ? పెద్దగ్లాసే!" అతని గుండె గుభేలుమంది.

"గ్లాసుకి పెద్దేమిటి, చిన్నేమిటి?" అంది వేదాంతి సత్యవతి

"ఇంతకీ కనబడిందా!" అని పట్టి ఆదుర్దా వెలిబుచ్చేడు శివయ్య.

"కనబడితే మిమ్మల్ని ఎందుకు అడుగడం? పనిలేకా?"

"ఇల్లు దాటిందన్నమాటే!"

"అదే మీ మొదటి ఆశీర్వచన! కాస్త వెతికిచూడండని నేను మొర్రపెడుతూంటే!"

"ఇదివరకు పోయినవాటినే కలుసుకోడానికి వెళ్లింద ఇదికూడా. ఇంకెందుకు వెతకడం?"

"అబ్బబ్బ! కాస్త వెతకండి అంటూంటే!"

"ఎక్కడ వెతకమన్నావో చెప్పు"

"పరుపులు, మంచా లుకూడ వెతకండి!"

"ఎవర్తో నీవంటిదే పెసరచేలో నత్తుపోతే పప్పుకుండలో వెతికిందిట!"

"ఊరికే మాటాడక కాస్త వెతుకుదురూ!"

"అదొక దండగపని కూడ ఎందుకు అని నేనడగడం" అన్నాడు శివయ్య కాని పెళ్లాం మాట తీసివెయ్యలేక లేదు లేదనుకొంటూనే పరుపులు, మంచాలు వెతికేడు.

"మొుదట మిమ్మల్ని అవతలికి పంపించి మళ్లీ మరో మాటు ఇల్లంతా గాలించివేస్తాను లెండి!" అంటూ సత్యవతి భర్తకి వడ్డించింది.

అతను భోంచేసి గుమ్మందాటేడు.

# వదలని తెగులు

సత్యవతి మళ్ళోకమాటు లంకంత ఇంటిని ఓపికగా వెతికింది పాపం!

సాయంత్రం శివయ్య ఇంటికివచ్చి మొదటి ప్రశ్నగా "దొరికిందా?" అన్నాడు.

"లేదు!"

ఆ గళాసు ఎవరిచేతులలో పడిందో ఇద్దరికీ తెలును కాని ఏమిలాభం?

మరి నాలుగురోజులయింది. సత్యవతి తలంటి నీళ్లుపోసుకుంటూ ముక్కువి, చెవులవి తీసి స్నానాల గదిలో గూటిలో జాగ్రత్తగా పెట్టింది నాగే నీళ్లు పోసింది. సత్యవతికి నగలసంగతి సాయంత్రంకాని జ్ఞాపకం రాలేదు. అప్పుడు తక్షణం వెళ్లిచూసింది. ఏవీ?

భర్తకి కూడ తెలిసింది. "ఏలాపోయేయి?" అని అడిగేడు శివయ్య.

"ఏమో? ఏకాకులో ఎత్తుకు పోయేయో ఏమిటో?" అంది సత్యవతి.

"మరే కాకులూకావు! బుర్రకాకే ఎత్తుకుపోయింది",

"సొమ్ముపోయినవాడు పాపాన్ని పోయేడని సామెత మనం చూడందే ఒకళ్లమీద పెట్టకూడదు." అని సత్యవతి లాయరు పాయింటు ఎత్తింది.

శివయ్య అనుమానం పనిమనిషిమీదే కాబట్టి "ఇప్పటికేనా నాగిని విడిచిపెట్టుకొంటేనో!" అన్నాడు సూచనగా.

"మీకేమి తెలుసు! మీరు ఎన్నేనా చెప్తారు! ఇంటి చాకిరీచేసేవాళ్లకే తెలుస్తుంది, దాని బాధ! ఇంతకీ ఎవరు తీసేరో రుజువేదీ?" అంది భార్య.

తన మాట సాగకపోగా శివయ్య నోరు మూసుకొన్నాడు. నాగి కుదరని జాడ్యంలాగు తోచింది

ఇది నాగి పనేఅని సత్యవతికి నమ్మకంగా తెలుసు. కాని పైకి అంటే ఎంతో ప్రమాదం అని ఆమె విశ్వాసం

ఏదో సందర్భంలో శివయ్య ఒక రోజున "ఈ నాగి కాకపోతే మరొకర్తె దొరకక పోయిందా పనికి? ఇది మన కేమేనా ఉత్తపుణ్యానికి చేస్తూందా?" అని ప్రశ్నించేడు.

"ఇది పోతే వచ్చేది మట్టుకు ఇంతకంటె వెలగబెడుతుందనుకొంటున్నారు కామాలు!" అంది సత్యవతి.

"ఏమో మన ఖర్మం ఏలాగుందో ఎవరు చూశారు. ఇదేం ఈ ఇంటికి పుస్తి కట్టించా?" అన్నాడు శివయ్య.

"ఈకాలంలో ఎక్కడ పట్టినా పనివాళ్లు ఇంతేనండి!" అని సత్యవతి పది ఉదాహరణలిచ్చి శివయ్య నోరు మూసింది

శివయ్య చేతి మునివేళ్లతో నుదురు కొట్టుకొన్నాడు.

శివయ్య కళ్లజోడు హఠాత్తుగా మాయమయింది ఇంటి పనికి మాత్రమే ఇబ్బందయితే ఏలాగో సర్దుకొనేవాడు. కాని ఆఫీసుపని ఏలాగు? కళ్లు ఉండికూడ అంధుడితో సమానమయి. తనలో పదివేలెత్తి చూపించినట్లు కాగా, శివయ్య ఒక చెంపని కళ్లజోడుకోసం రెండో చెంపని దృష్టిలోపం కోసం ఏడ్చేడు.

"ఇది దాని పనే! ఇంకెంతకాలం దానిని భరించడం?" అని తనలో తాను గట్టిగా సణుగుకొన్నాడు శివయ్య.

"అది తియ్యలేదని బల్లగుద్ది చెప్పవచ్చండి!" అంది భార్య.

"అది తియ్యకపోతే ఇల్లు తినేస్తుందా ఏమిటి చెప్మా!" అని శివయ్య ఎదుర్కొన్నాడు

అదే సమయంలో నాగి ఆలా వెళుతూండగా శివయ్య "ఏమే నాగీ! కళ్లజోడు ఎందుకుతీశావే?" అని అడిగేడు

కాని దాని నోటినుంచి ఇంకా జవాబు రాకుండానే సత్యవతి అడ్డువచ్చి "శివ! శివ! అది ఎన్నడేనా అటువంటి పనిచేసి ఎరుగునా? ఎవరేనా వింటే నవ్విపోతారండీ!" అంది

"నీకేం తెలుసు మధ్య నువ్వు వస్తావు!" శివయ్య సాహసించి అన్నాడు.

"దాని గుణం నాకు కాకపోతే మీకా తెలుస్తుంది శివ! శివ!"

నాగి పన్నె చిన్నెలుగా మొదలుపెట్టింది అది పదమో. పాటో, ఏదుపో, భావగీతమో తెలియలేదు నాగికి రోషంపుట్టి అక్కడ ఒక్కక్షణం నిలువలేదు

(తరువాయి 48-వ పేజీలో)

# వదలని తెగులు

(31వ పేజీ తరువాయి)

నాగి ఇంటికి వచ్చేక ఇంకా ఒక్కపని ముట్టుకోలేదు. కాఫీతాగి చెసుకోడం అలవాటు కాగా పాచి ఊడవడం, అంట్లు తోమడం, ఇల్లు తుడవడం. నీళ్లు తోడడం మొదలైనవి అట్టే ఉన్నాయి సత్యవతి గుండెబద్దలయి పోయింది గబ గబ కాఫీ తయారుచేసింది. కాఫీ గ్లాసులో పోసుకొని అరిటాకుతో పట్టుకొంది. గూడానికి బయలుదేరి వెళ్లింది "నాగీ! ఓ నాగీ! ఇదిగో కాఫీతాగు మొట్ట మొదట! పాపం ఇంకా కాఫీయేనా పుచ్చుకోకుండావచ్చి పడిందే పోరుని పోరుబొగ్గులవ!" అని విచారించింది.

"నాకు కాఫీ అక్కర్లేదు అసలు మీ ఇంటి నౌఖరీయే అక్కర్లేదండి అమ్మగారూ!" అంటూ నాగి కళ్లొత్తుకుంది

"చాలులే! నీ ఇంటికి నువ్వు కాకపోతే మరెవరు చేసుకొంటారే! వెర్రిదానా! లే పాపం! మొదట ఇన్ని కాఫీ నీళ్ళు పడనీ తస్సాంతమవుతుంది!"

"అయ్యగారు ఎంతేసి మాటలన్నారండి అమ్మగారు! అది తలపుకి వచ్చినప్పుడల్లా పొర్లి పొర్లి వస్తూంది" అని నాగి బట్ట మొహానికి చాటుగా వేసుకొంది.

"శివ! శివ! ఆయనకేమి తెలుసులే! మొగాళ్ళ మూష్కులనే మాట నువ్వు ఇంతవ మునుపు వినలేదులే!"

"ఏమోనండి అమ్మగారు. మీ మొహం సూత్తూంటే ఏ సమాధానం సెప్పబుద్ధవడంలేదు!" అంటూ నాగి కుమిలి కుమిలి ఏడ్చింది

సత్యవతి ఎంతో ఓదార్చింది ఎంతో నొచ్చుకొంది

బలవంతంమీద నాగి కాఫీగ్లాసును పెదిమెలకి తాకించగా ద్రవపదార్థం జర జర లోపలికి ప్రవహించింది "పదండి మీరు ముందమ్మగారు! నేను యెనకనుంచి ఓపిక చేసుకొని కాళ్ళీడ్చుకుంటూ వస్తాను." అంటూ నాగి మూతి, కళ్ళు తుడుచుకొని, మొహానికిపైటచాటు చేసుకొంది.



దక్షిణాది పర్యటనలో మహాబలిపురంలోని పక్షితీర్థమందు ఆలయమర్యాదగా తలకు "వరిపట్టం" చుట్టుకొని నమస్కారం చేసున్న రాష్ట్రపతి శ్రీ రాజేంద్రప్రసాదుగారు, మదరాసు గవర్నరు శ్రీ ప్రకాశగారు